క్లుప్తంగా

ఉద్యోగాలకు ఎంపిక

పార్వతీపురం టౌన్: గాయత్రి విద్యాపరిషత్, విశాఖపట్నంలో నిర్వహించిన ప్రాంగణ నయామకాల్లో స్థానిక భాస్కర్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు పి.జ్యోత్స్న, ఎ.హర్షిత, ఒ.వినీల, డి. వాసవిలు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆ విద్యార్థినులు ఎకోహమ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలో మంచి వేతనంతో ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ బొంతు శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ ఎం.రవిశాస్త్రి, డైరెక్టర్ సురేష్, సిబ్బంది అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురం టౌన్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలగనుందని ఏఈ రామారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని నర్సిపురం, తాళ్లబురిడి సబ్‌స్టేషన్ మరమ్మతుల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. నర్సిపురం, సంగంవలస, హెచ్ కారాడవలస, వెంకంపేట, ఎమ్మార్‌నగరం, పుట్టూరు, రావికొన, చినబొండపల్లి, పెదమరికి, చినమరికి, డీకేపట్నం, తాళ్లబురిడి, గోచక్క, డోకిశీల,లచ్చిరాజుపేట, బందలుప్పి,పెదబండపల్లి, జమదాల, లక్ష్మీనారాయణపురం, పట్టణంలోని వైకేఎం కాలనీలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాలూరు: పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ డీవీ కిశోర్ తెలిపారు. విద్యుత్ వైర్లపై పడిన చెట్లు కొమ్మలను తొలగించడం, తదితర మెయింటనెన్స్ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీతీరాన వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి గురువారం భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వేకువజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఉపవాసాలతో దూర ప్రాంతాల నుంచి స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను కమిటీ సభ్యులు అందజేశారు.

144 సెక్షన్ అమలులో ఉంది

సాలూరు: ఇటీవల జరిగిన ఎన్నికల నేపథ్యంలో అమలు చేసిన 144 సెక్షన్ వచ్చే నెల 4వ తేదీ వరకు, పట్టణంలో, మండలాల్లో అమలులో ఉందని, ఈ విషయం అందరూ గుర్తించుకోవాలని పట్టణ సీఐ వాసునాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలోని ప్రజలతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల పోలింగ్ పూర్తయిందని, ఎన్నికల ప్రక్రియ పూర్తయినట్లు కాదన్నారు. సోషల్ మీడియాల్లో, బయట గాని రెచ్చగొట్టే విధంగా ఎటువంటి మెసేజ్‌లను ఫార్వర్డ్ చేయరాదని, అందరూ సంయమనం పాటించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

యోగాతో ఏకాగ్రత

పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా యోగాను అనుసరించడం వల్ల ఏకాగ్రత పెరుగుతుందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు, యోగా శిక్షకుడు కె.జనార్దనరావు అన్నారు. గురువారం స్థానిక ఋషి యోగా కేంద్రంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా సూర్య నమస్కారాల ఆవశ్యకతను చిన్నారులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యోగాపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. యోగా సాధన వల్ల ఆరోగ్య సమస్యలను అధిగమించడంతో పాటు రోగ నిరోధక శక్తిపై పట్టు సాధించవచ్చని చెప్పారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల పర్యటన

రేగిడి: ఎన్నికల నేపథ్యంలో మండలంలో గుర్తించిన పలు సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు పర్యటిస్తున్నారు. ఈ నెల 13వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరగడంతో కొన్నిచోట్ల ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల మధ్య ఎన్నికలకు సంబంధించిన తగాదాలు చోటు చేసుకుంటుండడంతో పోలీసులు గ్రామాలను సందర్శించి, గొడవలు జరగకుండా చూస్తున్నారు. మండలంలోని అంబఖండి, సోమరాజుపేట, కాగితాపల్లి, కొండవలస తదితర గ్రామాల్లో గురువారం పర్యటించిన ఎస్‌ఐ శ్రీనివాసరావు.. గ్రామాల్లో శాంతియుత వాతావరణానికి ప్రజలంతా సహకరించాలని కోరారు.

ఆ ఇళ్ల వయస్సు రెండున్నర శతాబ్దాలు

సీతానగరం: మండలంలోని పూర్వీకులు వరిఊక, పులబోసిన మట్టి(పొట్టు)తో కట్టిన పెంకుటిళ్లు ఇప్పటికీ చెక్కు చెదలేదంటే నిర్మాణంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నారో జయంతిరాయపురం అగ్రహారం ఇళ్లను చూస్తే అర్థమవుతుంది. ఈ మేరకు జయంతిరాయపురంలో సువర్ణముఖి నది ఒడ్డున ద్రావిడ బ్రాహ్మణ శాఖకు చెందిన కర్రా సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, గంటి సుబ్బారావు, కర్రా అప్పలనరింహులు కుటుంబాలకు చెందిన వారు 250 సంవత్సరాల క్రితం వరి పొట్టు, పులబోసిన మట్టి, పచ్చి ఇటుకలు, తోక పెంకులతో కూడిన పెంకుటిళ్ల ఇళ్ల నిర్మాణం చేశారు. సివిల్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రులైన వారితో ప్లాన్ గీయించి ప్రస్తుత కాలంలో ఇళ్ల నిర్మాణం చేపట్టినా వంద సంవత్సరాలు ఉంటాయో లేదోనని నిర్వాహకులకు అనుమానమే. అటువంటిది 250 సంవత్సరాల క్రితం నిర్మించిన ఇళ్లు చరిత్రపుటల్లో నిలిచిపోతాయనడానికి నిదర్శనం జయంతిరాయపురంలో పూర్వీకులు నిర్మించిన ఇళ్లు. ఆ పెంకుటిళ్లు 250 సంవత్సరాలుగా కుటుంబీకులకు నీడనిస్తున్నాయంటే ఆశ్చర్యంగా ఉంది. బ్రాహ్మణ కులస్తులు ఉద్యోగాలరీత్యా, వృత్తి రీత్యా పట్టణాలకు వెళ్లిపోవడంతో ఆ ఇళ్లను శుద్ధి చేసుకునేందుకు వేరేవారు నివాసం ఉంటున్నారు. ఆ ఇళ్ల యజమానులు పండగలకు, గ్రామ దేవత సంబరాలకు రావడం మూడు రోజులు ఇళ్లలో ఉండి ఉత్సవాలను చూసుకుని తిరిగి వెళ్తుంటారు. బ్రాహ్మణ కుటుంబంతో అనుబంధం ఉన్న గ్రామస్తుడు కేవీ రమణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ల్యాండ్‌లార్డ్‌గా పేరొందిన కర్రా అప్పలనరసింహులు కుటుంబసభ్యులు 250 సంవత్సరాల క్రితం నిర్మించిన పెంకుటిళ్లు ఇవి అని, కొద్దిగా మరమ్మతులకు గురైతే బాగు చేయించడం మినహా పెట్టుబడి లేదని చెప్పారు. ఇంతటి వయస్సున్న ఇళ్లు ఇప్పటికీ చెక్కు చెదరలేదంటే అశ్చర్యం కలగక మానదన్నారు. ఇటువంటి నిర్మాణాలు చరిత్రపుటల్లో నిలిచిపోతాయనడానికి నిదర్శనంగా ఈ ఇళ్లే కన్పిస్తున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.



జయంతిరాయపురంలో 250 సంవత్సరాలనాటి పెంకుటిళ్లు

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి

- సామాజిక సేవగా భావించి ముందుకు రావాలి
- జిల్లా బ్లడ్ బ్యాంకు నుంచి నెలకు 600 వరకు యూనిట్ల రక్తం వినియోగం



రక్తం ఇస్తున్న దాతలు

పార్వతీపురం టౌన్: ప్రాణాపాయ స్థితిలో ఉండి రక్తం కోసం ఎదురుచూసి సకాలంలో అవసరమైన గ్రూపు రక్తం అందక మృత్యువాత పడుతున్న బాధాకర పరిస్థితులు అక్కడక్కడా సంభవిస్తున్నాయి. ఆ పరిస్థితిని అధిగమించి నలుగురికి ప్రాణదానం చేయాలన్న సత్సంకల్పం ప్రజల్లో వస్తే మరింత సానుకూల సమాజ నిర్మాణానికి కారణమవుతారని వేరే చెప్పనక్కర్లేదు. ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానంతో సమానమని భావించి ఈ పవిత్ర కార్యక్రమానికి అందరూ ముందుకు వస్తే శుభపరిణామంగా భావించవచ్చు. దాతలు రక్తదానంపై ఆరోగ్యపరమైన ఇతరత్రా అపోహలను మాని మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తే వారు మరింత చురగ్గా, దేహదారుఢ్యంతో కొనసాగుతారన్న నగ్న సత్యాన్ని విస్మరించరాదు. వైద్యులు రక్తదానంపై ఎన్నో వేదికల మీద సుదీర్ఘంగా చర్చోపన్యాశాలను అందించిన విషయం విదితమే. స్వచ్ఛంద సేవా సంస్థలు రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. ప్రభుత్వం కూడా ఆదిశగా ఒక అడుగు ముందుకు వేసి ప్రచారం విస్తృతం చేసి ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంతో దాతల సంఖ్యను అమాంతం పెంచి రక్త సేకరణకు ప్రాధాన్యం ఇవ్వడంతో ఫలితాలు ఆశాజనకంగా ఉంటున్నాయి. దాతలకు రక్తం ఇచ్చేటప్పుడు డోనర్ కార్డులు ఇచ్చి వారికి గాని, వారి కుటుంబాలకు గాని ఎప్పుడైనా రక్తం అవసరమైతే ఆ కార్డులను వినియోగంలోకి తీసుకురావచ్చన్న పరిస్థితిని కల్పించడంతో రక్తదాతల సంఖ్య పెరుగుతోంది. ప్రత్యేక రోజుల్లో రక్త సేకరణ కార్యక్రమాలను చేపట్టి అధిక సంఖ్యలో యూనిట్ల రక్తాన్ని సేకరించి, నిల్వచేయడంతో ప్రమాద పరిస్థితుల్లో రోగులకు రక్తాన్ని అందించగలుగుతున్నారు.

ఐదేళ్ల క్రితం ఐఆర్‌సీఎస్ రక్తనిధి కేంద్రం

పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో ఐదేళ్ల క్రితం ఐఆర్‌సీఎస్ రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేయగా తరువాత ప్రభుత్వం దీన్ని తమ పరిధిలోకి తీసుకుని రక్తనిధి కేంద్రాన్ని కొనసాగిస్తోంది. దీంతో పూర్తి బాధ్యతలను ఆస్పత్రి వర్గాలు స్వీకరించి రక్తసేకరణపై ప్రత్యేక దృష్టి సారించి అధిక రక్త నిల్వలకు కారణమవుతున్నాయి. ప్రస్తుతం జిల్లా రక్తనిధి కేంద్రం నుంచి నెలకు 600 బ్యాగ్‌ల రక్తం వినియోగం అవుతోంది. గతంలో ఎవరికైనా రక్తం అవసరమైన వారు రూ. 850లు చెల్లించి ఒక యూనిట్ రక్తం ప్యాకెట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు అలా కాకుండా పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రక్తం అవసరమతే ఉచితంగా రోగులకు రక్తాన్ని అందిస్తున్నారు. సేకరించిన రక్తం బ్యాగ్‌లు రక్త హీనతతో బాధపడుతున్న గర్భిణులు, సికిల్‌సెల్ ఎనీమియా, తలసీమియా, డయాలసిస్ పేషెంట్లకు రక్తం అవసరం పడుతున్నాయి. వీరితో పాటు రక్త హీనత రోగులు కూడా ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారు. ఇంతటి అవసరమైన రక్తదానాన్ని ప్రోత్సహించి ప్రజలు, ముఖ్యంగా యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేస్తే భవిష్యత్‌లో ఎంతోమందికి సహాయ పడినట్లవుతుందని రక్తనిధి కేంద్ర ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రక్తదాతలు అపోహలు వీడాలి

రక్తదాతలు అపోహలను వీడి రక్తదానానికి ముందుకు రావాలి. రక్తదానం మూలంగా ఆరోగ్యం మరింత ఉత్సాహంగా మారుతుంది. ఏరియా ఆస్పత్రి పరిధిలో మూడు రక్తనిల్వల కేంద్రాలను కురుపాం, సాలూరు, బొబ్బిలి పీహెచ్‌సీలలో ఏర్పాటు చేసి ఆయా ప్రాంత రోగులకు రక్తనిల్వలు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం.

–డా. వాగ్దేవి, పార్వతీపురం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

డెంగీ నివారణలో భాగస్వాములు కావాలి



పార్వతీపురం టౌన్: సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయపార్వతి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయపార్వతి
- జిల్లా కేంద్రంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం

పార్వతీపురంటౌన్: డెంగీ వ్యాధి నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతి పిలుపునిచ్చారు. ఈ మేరకు వైద్య సిబ్బందితో కలిసి వైద్యారోగ్య శాఖ కార్యాలయం ప్రాంగణంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఏడిస్ దోమల ద్వారా డెంగీ వ్యాధి వ్యాప్తి చెందుతుందని హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరంతో ఈ వ్యాధి మొదలవుతుందని, ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి, శరీరంపై రాష్, వాంతి వికారం, రక్తస్రావం తదితరాలు ఈ వ్యాధి లక్షణాలని చెప్పారు. త్వరగా గుర్తించడం ద్వారా డెంగీ వ్యాధి తీవ్రం కాకుండా జాగ్రత్త పడవచ్చని, నివారణ సులభ మార్గమని ప్రజల్లో అవగాహన పెంపొందించాలని కోరారు. సమర్థవంతంగా ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాలు చేపట్టడం, దోమల లార్వా వృద్ధి చెందే స్థావరాలను గుర్తించి తొలగించడం, నీటి తొట్టిలపై మూతలు ఉంచడం, దోమతెరలు వినియోగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని సూచించారు. ఆరోగ్య కేంద్రాలు, క్షేత్రస్థాయిలో డెంగీ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సమాజ భాగస్వామ్యంతో డెంగీ వ్యాధి నివారణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఎంఓ డాక్టర్ టి.జగన్ మోహనరావు, ఏఎంఓ సూర్యనారాయణ, ఎపిడిమాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ నగేష్ రెడ్డి, డెమో యోగీశ్వరరెడ్డి, ఈఓ నాగేంద్ర, హెల్త్ సూపర్వైజర్స్, కార్యాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం: డెంగీ వ్యాధి నివారణ ర్యాలీ చేస్తున్న డాక్టర్ బి.పావని

సీతానగరంలో..

సీతానగరం: ప్రజల భాగస్వామ్యంతో సమర్థవంతంగా డెంగీ వ్యాధిని నిర్మూలిద్దామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ బి.పావని పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం డాక్టర్ పావని ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని పురవీధుల్లో జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోవత్సవ ర్యాలీని సీహెచ్‌ఓ ఎస్వీ రమణ నిర్వహించారు. ఈ మేరకు పీహెచ్‌సీ డాక్టర్ పావని మాట్లాడుతూ ప్రభుత్వం మరణాల సంఖ్యను తగ్గించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, వ్యాధుల నివారణకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శర్మ, సత్యవతి, వైద్యసిబ్బంది చంద్రినాయుడు, హరికృష్ణ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జైగురుదత్త హోమం

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో జైగురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ తదితర పూజల అనంతరం ఆలయ అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులు హోమం చేశారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.



హోమం చేస్తున్న భక్తులు

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన బోధన

పాలకొండ రూరల్: ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులచే మెరుగైన బోధన అందుతుందని స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ హరగోపాల్ అన్నారు. పట్టణ పరిసర ప్రాంతాలైన తలవరం, నీలానగరం, తెట్టంగి, బెజ్జి, పారాపురం, తదితర గ్రామాల్లో సహచర అధ్యాపకులతో కలిసి గురువారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ కళాశాలల్లో అందుతున్న సౌకర్యాలపై వివరించారు. కళాశాలలో ప్రత్యేక లేబరేటరీలు, ఐఎఫ్‌పీ ప్యానల్స్ ద్వారా డిజిటల్ విద్య అందించడం, ఎంసెట్, నీట్, తదితర పోటీ పరీక్షలకు అందిస్తున్న శిక్షణ వంటి అంశాలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు.



బెజ్జిలో అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్, తదితరులు

సీతంపేటే కొండంత అండ..

- రెండుసార్లు వైఎస్సార్‌సీపీని గెలిపించింది గిరిజన ఓటర్లే
- ముచ్చటగా మూడోసారి విజయం ఖాయమంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సీతంపేట:

సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీ విజయం సాధించాలన్నా నిర్ణయించేది సీతంపేట మండలమే అని చెప్పుకోవచ్చు. రెండు సార్లు వరుసుగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి గెలుపు వెనుక స్థానిక ఓటర్ల మద్దతు ఉందనే చెప్పుకోవాలి. మూడోసారి కూడా కళావతి గెలుపు ఖాయమని వైఎస్సార్‌సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2014లో నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1,64,752 కాగా పోలైన ఓట్లు 1,21,428. అప్పట్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతికి 55,337 ఓట్లు పోలవ్వగా, టీడీపీ అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు 53,717 ఓట్లు పడ్డాయి. దీంతో 1620 ఓట్ల మెజార్టీతో కళావతి గెలుపొందారు.

- 2019లో మొత్తం ఓట్లు 1,84,414కు గాను 1,36,712 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కళావతికి 72,054 ఓట్లు పోలవ్వగా, జయకృష్ణ (టీడీపీ) 54,074 ఓట్లు పోలయ్యాయి. 17,980 మెజార్టీతో కళావతి విజేతగా నిలిచారు. రెండుసార్లూ సీతంపేట ఓటర్లు కళావతికి అండగా నిలిచారు. ఈ సారి జనసేనకు వైఎస్సార్‌సీపీకి మధ్య పోటీ ఉండడంతో కళావతి గెలుపు నల్లేరుపై నడకేనని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,95,020 మంది కాగా వీరిలో 1,46,781 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇందులో సీతంపేట మండలంలో మొత్తం ఓట్లు 45,195 కాగా 36,192 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.



కోడిశలో ఓటు వేయడానికి క్యూలో నిలుచున్న ఓటర్లు (ఫైల్)

గ్రామం పేరు	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు						
			తాడిపాయి	378	332	సీతంపేట	2340	1513
			జయపురం	241	230	పెద్దూరు	454	392
దిబ్బగూడ	876	664	నాయకమ్మగూడ	325	260	పాతపనుకువలస	453	354
సోమగండి	868	619	గడికారెం	193	178	వలగెడ్డ	392	336
అక్కన్నగూడ	672	487	గడిగుజ్జి	184	176	గొయిది	549	455
కిరప	412	368	దుగ్గి	360	340	జక్కరవలస	229	216
హడ్డుబంగి	1064	651	వెలగాపురం	287	255	ఇసుకగెడ్డ	231	177
ఉప్పరజమ్మి	527	437	కొత్తకోట	241	227	దిగువదరబ	288	246
చింతాడ	447	315	మానాపురం	339	312	శిలిగాం	545	428
కొండాడ	824	515	కుసుమూరు	449	392	కుశిమి	599	511
బెనరాయి	744	531	టిటుకుపాయి	277	260	తాలాడ	801	623
పులిపుట్టి	706	539	సామరెల్లి	328	288	మల్లి	359	322
ముకుందాపురం	679	573	పుబ్బాడ	323	301	సార	192	181
మర్రిపాడు	1222	906	జల్లార	296	281	వజ్జాయిగూడ	558	409
చిన్నబగ్గ	1008	731	సీది	438	409	జజ్జువ	245	230
గోరపాడు	591	470	గుజ్జి	262	240	శంబం	833	486
పూతికవలస	709	611	పెద్దపల్లంకి	207	178	ఆడలి	284	258
తుంబలి	411	291	చిన్నపల్లంకి	162	153	కిండంగి	229	215
చావిడివలస	676	550	బర్న	220	202	తొత్తడి	276	231
గుమ్మడ	254	207	పెదరామ	1006	702	పొంజాడ	265	249
గాటిగుమ్మడ	217	205	నౌగూడ	237	228	గులుమూరు	328	253
దబర	98	94	కోపువలస	120	102	కొండచొర్లంగి	158	136
కోసంగి	171	155	కారెంగూడ	392	358	జిల్లేడుపాడు	289	207
దంజుపాయి	148	131	దేవనాపురం	502	412	కోడిశ	1297	939
తుంబకొండ	330	279	వంబరెల్లి	343	270	ముత్యాలు	404	295
రామానగరం	388	336	జగతపల్లి	587	445	కోతాం	205	177
కిల్లాడ	445	359	అంటికొండ	549	455	దబర	661	502
దారపాడు	542	417	కురసింగి	276	257	కడగండి	429	323
గాడిదపాయి	321	297	పెద్దకంబ	144	139	చిన్నవంగర	184	173
దోనుబాయి	798	671	కుడ్డపల్లి	980	719	పెదవంగర	158	141
పెద్దతంకిడి	209	188	చిన్నకంబ	322	300	సారంగి	480	416
దాసుగుమ్మడ	163	151	బుడగరాయి	188	175	ఓంద్రుజోల	204	181
కె.వీరఘట్టం	321	270	మండ	665	600	గజిలి	438	409
పెద్దపాల్ల	462	401	జొనగ	522	443	లోకొత్తవలస	192	172

ఘనంగా ఎల్లమ్మ సంబరాలు

సంతకవిటి: మండలంలోని రంగారాయపురం గ్రామంలో ఎల్లమ్మ సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి అమ్మవారికి మనువు చెల్లించారు. గురువారం ఉదయం ప్రత్యేక పూజలు చేసి, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో కోరాడ కుటుంబీకుల ఇలవేల్పు సత్తెమ్మ సంబరాలు గురువారం వైభవంగా నిర్వహించారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ప్రాంతాల్లోని తదితర ప్రాంతాల్లోని కోరాడ వంశీకులంతా ఈ వేడుకలకు హాజరై, అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి

కురుపాం: ప్రతీ రైతు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభించాలని, అలా అయితే తక్కువ శ్రమతో అతితక్కువ సమయంలో పంట దిగుబడి సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసరాజు తెలిపారు. మండలంలోని గవరంపేట గ్రామంలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థుల రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమానికి గురువారం హాజరైన ఆయన.. వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్న సాగు సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. సరికొత్త కలుపుమందుల పట్ల అవగాహన పెంచుకోవాలని డాక్టర్ జ్యోతిబసు తెలిపారు. కొత్త వంగడాలను రైతులు పొలంలో వేసుకోవాలని డాక్టర్ స్రవంతి సలహా ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం డీపీఎంయూ షణ్ముఖరాజు మాట్లాడుతూ ప్రతీ రైతు వివిధ రకాల పంటలను 365 రోజులూ పండించుకోవచ్చని తెలిపారు. ఓ ప్రణాళికా ప్రకారం సాగు చేస్తే ఏకకాలంలో బహుళ పంటలను పండించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు చేతికి వస్తాయన్నారు. అనంతరం రైతులకు నవధాన్యాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యంనాయుడు, వ్యవసాయ కళాశాల, నైర విద్యార్థులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న కృషి విజ్ఞానం కేంద్రం శాస్త్రవేత్తలు

వర్షం నుంచి రక్షణ..

భామిని: మండలంలో కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి నూర్పులు పూర్తవడంతో ధాన్యం బస్తాలను పొలాలు, కళ్లాల్లోనే ఉంచారు. అయితే కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ధాన్యం బస్తాల రక్షణలో తలమునకలై ఉన్నారు. టార్పాలిన్లు కప్పుతూ బస్తాలు తడవకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.